క్లుప్తంగా

భారీ వర్షంతో పంటలకు జీవం



మెట్టలో కళకళలాడుతున్న మొక్కజొన్న తోట

రంగంపేట: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది. పంట పొలాలకు నీటి ఎద్దడి తప్పింది. కూరగాయలు, ఆకు కూరలు, అరటి, వంగ, బీర, ఆనబ, మిరప పంటలకు, మొక్కజొన్న, బొప్పాయి, జామ, పామాయిల్, కొబ్బరి తోటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పనులకు కూడా ఈ వర్షం ఉపయోగపడుతుంది. నారుమడులు వేయడానికి, వేసిన ఆకుమడులు ఏపుగా ఎదగడంతో పాటు సకాలంలో వరినాట్లు పడటానికి అవకాశం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ లేఅవుట్‌పై చట్టప్రకారం చర్యలు



కొమరిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: అక్రమ లేఅవుట్‌పై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన శనివారం కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల్లో పర్యటించారు. కొమరిపాలెం సబ్ స్టేషన్ దగ్గర లేఅవుట్‌కు అక్రమ మార్గంలో అధికారులను మోసం చేసి రుడా అనుమతులు పొందారని, వాటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. కొంకుదురులోని కెనాల్‌లో పేరుకుపోయిన తూడును పరిశీలించారు. అవసరమైతే ఉపాధి కూలీలు, రైతుల సహాయం తీసుకుని పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు.

నేడు పునీత ఆంథోనీ వేడుకలు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం సాయంత్రం పునీత ఆంథోని ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఫాదర్ మాణిక్యం తెలిపారు. క్రైస్తవ మత విస్తరణలో ఆంథోనీ అమితమైన కృషి చేశారన్నారు.

మహాకవి శ్రీశ్రీకి నివాళి




శ్రీశ్రీ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

బిక్కవోలు: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) వర్ధంతిని కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని విశ్వ జనీనం చేసిన మహోన్నతుడు శ్రీశ్రీ అని కొనియాడారు. పాఠశాల డిజిటల్ సీన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు మాదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

పెదపూడి: పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో సామాజిక పింఛన్ల పెంపుపై లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, తరలివచ్చిన భక్తులు

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం మహోత్సవం ఘనంగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: దాడి ఘటనపై బొబ్బిల్లంకకు చెందిన కొల్లి శివ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోడదాసి చిన్నాపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. శివకుమార్‌ను అతడి స్నేహితుడు చిన్నా మద్యం కొనుగోలు చేయడానికి డబ్బులు అడిగాడు. అయితే మద్యం షాపు వద్ద తన పేరు చెప్పి శివ కుమార్ బదులిచ్చాడు. దీంతో ఘర్షణకు దిగిన చిన్నా ఇనుప ఊచతో శివకుమార్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో శివకుమార్ చేతికి గాయమైంది.

త్యాగాల పండగకు సర్వం సిద్ధం

- రేపే బక్రీద్ పర్వదినం
- పూర్తయిన ఏర్పాట్లు



పందలపాకలోని మసీదు



పందలపాకలో నమాజు చేస్తున్న ముస్లింలు

బిక్కవోలు: ముస్లింలు జరుపుకొనే ముఖ్యమైన పండగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతి రూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ అజహ్ (బక్రీద్). దీనే త్యాగాల పండగ అని కూడా పిలుస్తారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాలలో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణాలు చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్ గాహ్‌కు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు.

సందడి షురూ..

మార్కెట్‌లో బక్రీద్ సందడి మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు గుంటూరు, హైదరాబాద్, విజయనగరం నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరి కొందరు తమ దగ్గరిలోని గోకవరం, ఇలపల్లి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఖుర్బానీ కోసం సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ. 8 వేల నుంచి రూ.22 వరకూ పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. బక్రీద్ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొట్టేళ్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.

పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తుందంటే పొట్టేళ్లకు గిరాకీ పెరుగుతుంది. వారం రోజుల నుంచే కొత్త బట్టలు, పండగ సామగ్రి కొనుగోలు చేస్తారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. పండగ తరువాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చే అవకాశం ఉంది.

త్యాగనిరతి



బక్రీద్ పండగ మనిషికి దైవభీతి, త్యాగనిరతిని తెలియజేస్తుంది. అందుకే దీనిని త్యాగాల పండగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత.

– షేక్ రహిమన్, ముస్లిం పెద్ద, పందలపాక

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి.

– మౌలానా షేక్ గూలం గౌసీరిజ్వీ, జామియా మసీద్ గురువు, పందలపాక

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మాధవి

పెదపూడి: వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మాధవి హెచ్చరించారు. మండలంలోని పెదపూడి, దోమాడ గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల షాపులలో రికార్డులు, సరుకు నిల్వలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల వద్ద విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు 100 గింజలు తీసుకుని ముందుగా మొలకశాతం కట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన షాపులలో విత్తనాలు బస్తాల నుంచి శాంపిళ్లు సేకరించారు. మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్, సుధా మాధురి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలోని అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



అఖండ బిల్వార్చన చేస్తున్న పండితులు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం చక్రద్వారబంధానికి చెందిన నాగవరపు రామకృష్ణ దంపతులచే నరేంద్రపురానికి చెందిన వేద పండితుడు దీక్షితులు శ్రీరామ్ ఆధ్వర్యంలో అఖండ బిల్వార్చన జరిగింది. తొలుత బాబా ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి, వార్షికోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సంధ్యా హారతి తర్వాత ఫరిజల్లిపేటకు చెందిన వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



చినకొండేపూడి - పెదకొండేపూడి రోడ్డుపై కూలిన చెట్టు



చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డుపై నేలకొరిగిన చెట్టు, విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వాటికి భారీ వర్షం తోడవ్వడంతో ప్రజలు ఆందోళన చెందారు. గాలి వేగానికి రోడ్డు మీద కూడా నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. శనివారం ఉదయం వాతావరణం మబ్బుగా ఉన్నా ఉక్కబోత ఎక్కువైంది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్య విపరీతమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చినకొండేపూడి - పెదకొండేపూడి, చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డులో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చిన కొండేపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలిచిపోయింది. మండలంలోని పలు గ్రామాలలో సరఫరా ఆగిపోయింది. వర్షం కురవడంతో రైతులు పొలాలను దుక్కు చేయడానికి ట్రాక్టర్లపై బయలుదేరగా, రోడ్లపై చెట్లు పడిపోవడంతో ఎక్కడి ఆగిపోయారు. అలాగే ఆ దారిలో వెళ్లే వాహనాలు కూడా నిలిచిపోయాయి. విద్యుత్ ఏఈ చంద్రమోహన్ తన సిబ్బందితో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

పండ్ల తోటలకు నష్టం

ఈదురుగాలుల కారణంగా మండలంలో పండ్ల తోటలకు నష్టం కలిగింది. ఆఖరి దశలో ఉన్న మామిడి తోటలు దెబ్బతిన్నాయి. జీడిమామిడి, సపోటా చెట్ల కాయలు రాలిపోయాయి.

ఓ నాన్న.. నీ మనసే వెన్న

- ఆపద వేళ ఆత్మీయుడు
- ధైర్యం చెప్పే స్నేహితుడు
- నేడు అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం

బిక్కవోలు: వారధి లేకుండా నదిని దాటలేము, సారథి లేకుండా రథం నడవదు. ప్రతి కుటుంబానికి ఆ వారధి, సారథి తండ్రే. పిల్లలు తప్పటడుగులు వేసే వయసు నుంచి వారికి అన్ని విధాలా అండగా ఉంటూ ప్రతి అడుగులోనూ నీడలా ఉండే దైవం తండ్రి. కన్నీటి కష్టాన్ని కనురెప్పల మాటున దాచుకుని, తాను చిరిగిన చొక్కా అయినా వేసుకుని, తన పిల్లలకు మంచి దుస్తులు కొని ఇవ్వాలని ఆరాటపడే హృదయం ఆయనది. తన పిల్లలను గుండెల్లో పెట్టుకుని పెంచి పెద్ద చేసి, ఉన్నత స్థాయికి చేర్చేందుకు తహతహలాడుతారు. మాట కాస్తా కటువుగా ఉన్నా మనస్సు వెన్నే. నేడు అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం. ఈ సందర్భంగా తండ్రితో తమ అనుబంధాన్ని పలువురు ‘సాక్షి’తో పంచుకున్నారు.

పితృ దినోత్సవం చరిత్ర ఇదీ..

పితృదినోత్సవం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. తమకు జన్మనిచ్చిన తండ్రిని గౌరవించుకోవాలని, అందుకు ఒక ప్రత్యేకమైన రోజును సృష్టించాలనే ఆలోచన అమెరికాలోని వాషింగ్టన్‌లో మొగ్గ తొడిగింది. 1909లో మదర్స్‌డే గురించి విన్న వెంటనే సోనోరా స్మార్ట్ అనే మహిళ మదిలో ఫాదర్స్‌డే నిర్వహించాలనే ఆలోచన పుట్టింది. తల్లి మరణానంతరం సోనారా స్మార్ట్ తన తండ్రి జాక్సన్ వద్దే పెరిగింది. తనకు తండ్రి అంటే ఎంత ఇష్టమో చెప్పాలనిపించి తండ్రి పుట్టిన రోజు అయిన జూన్19న 1910లో వాషింగ్టన్‌లోని స్పొకెన్‌లో తొలి సారిగా ఫాదర్స్‌డే నిర్వహించింది. 1926లో జాతీయ స్థాయి ఫాదర్స్‌డే కమిటీ న్యూయార్క్‌లో ఏర్పాటైంది. 1956లో సంయుక్త తీర్మానం ద్వారా అమెరికాన్ కాంగ్రెస్ ఫాదర్స్‌డేను గుర్తించింది. ఏటా జూన్ మూడో ఆదివారం ఫాదర్స్‌డే నిర్వహించేందుకు 1966లో ప్రెసిడెంట్ నిక్సన్ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్ డే నిర్వహిస్తున్నారు.

నాన్న అంటే ధైర్యం



తండ్రి సత్యనారాయణతో సప్పా నాగేశ్వరరావు, కొంకుదురు

నాన్న అంటే నాకు ఎంతో ధైర్యం. నాకు ఏ సమస్య వచ్చినా, కష్టం వచ్చినా నాన్న ఉన్నారనే నమ్మకం ముందుకు నడిపిస్తుంది. నేను ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆయన అనునిత్యం కలలు కంటున్నారు. ఆయన కోరికను తప్పకుండా తీర్చుతాను.

– తండ్రి సత్యనారాయణతో కుమారుడు సప్పా నాగేశ్వరరావు, కొంకుదురు

చాలా ఇష్టం



తండ్రి అప్పారావుతో గొర్రిపోటి సృజన, పందలపాక

నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నాకోసం అనునిత్యం ఆలోచిస్తూ ఉంటారు. కంటికి రెప్పలా ఎల్లప్పుడూ కాపాడుతుంటారు. నాకు కొద్దిగా నలతగా ఉన్నా తట్టుకోలేరు. మంచి స్నేహితుడిలా ఉంటూ ముందుకు నడిపిస్తారు.

– నాన్న అప్పారావుతో గొర్రిపోటి సృజన, పందలపాక

మంచి స్నేహితుడు



తండ్రి గొలుగూరి నాగిరెడ్డితో పడాల దేవి, పొలమూరు

ఆడపిల్లలకు తల్లి దగ్గర కన్నా తండ్రి దగ్గరే చనువు ఎక్కువగా ఉంటుంది. నా విషయంలోనూ అదే నిజమైంది. మా నాన్న చిన్నప్పటి నుంచి నన్ను చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. నాకు పెళ్లి అయి, కూతురు ఉన్నప్పటికీ ఇంకా చిన్న పిల్ల మాదిరిగానే చూస్తారు.

– తండ్రి గొలుగూరి నాగిరెడ్డితో పడాల దేవి, పొలమూరు

10,450 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



రాజానగరంలో పట్టుబడిన రేషన్ బియ్యం

రాజానగరం: అక్రమంగా తరలిస్తున్న 10,450 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రాజానగరంలో పట్టుకున్నారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు స్థానిక జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన ఉప్పల ప్రకాష్‌కు చెందిన ఐషర్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, 6ఏ కేసు నమోదు చేశారు. వాహన యజమానితో పాటు డ్రైవర్ కొత్తపల్లి నాగరాజుపై కూడా కేసు నమోదు చేశారు. ఈ అక్రమ రవాణాకు అసలు కారకులెవరనే విషయం ఆరా తీస్తున్నామని, దీనికి కారకులైన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10,75,475గా అంచనా వేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, లోవరాజు, శివ, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ దివాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెందుర్తికి సన్మానం

సీతానగరం: టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్‌ను ముగ్గళ్లకు చెందిన ఆ పార్టీ నాయకులు శనివారం సన్మానించారు. వెంకటేశ్ కృషి ఫలితంగానే కూటమి ఘన విజయం సాధించిందని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి శివకుమార్

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శనివారం జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివ కుమార్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ఈ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారు చట్టానికి జవాబుదారులు అవుతారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ నల్సా వారి చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండ్ దేర్ ప్రొటెక్షన్ యాక్ట్ గురించి వివరించారు. ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీ బాషా మాట్లాడుతూ పోలీసు అధికారులకు జువైనల్ జస్టిస్ యాక్ట్ నిబంధనలు, ఈ కేసులను ఏ విధంగా త్వరితగతిన పూర్తి చేయాలో వివరించారు. 3వ అదనపు జుడీషియల్ మెజిస్ట్రేట్ సి.రమ్య మాట్లాడుతూ పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారుల విధులను తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, దిశ ఉమెన్ పోలీసు స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.ఆదినారాయణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు తబిత పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం



విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మానవతావాది టీకే విశ్వేశ్వరరెడ్డి సేవలు అభినందనీయమని పేపర్ మిల్లు ఆఫీసర్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్పీఎన్ దొర కొనియాడారు. రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డికి ఇటీవల డాక్టరేట్ వచ్చిన సందర్భంగా శనివారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో అభినందన సత్కారం నిర్వహించారు. దొర మాట్లాడుతూ పేపర్‌మిల్లులో ఇంజినీర్‌గా పనిచేసిన విశ్వేశ్వరరెడ్డి అటు ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ముందుకు నడుపుతూనే, మరో వైపు పేపర్ మిల్లు కార్మికుల హక్కుల కోసం పాటుపడ్డారని ప్రశంసించారు. సన్మాన గ్రహీత విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాలుష్య గోదావరి నీటిని పరిశుభ్రమైన తాగునీరుగా మార్చేందుకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్వీ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ఎస్ వీరభద్రం, కోశాధికారి బి.అప్పారావు, కె.సుధాకర్ పట్నాయక్, ఎన్.అప్పారావు, ఫణీంద్రరావు పాల్గొన్నారు.

వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించొద్దు



వెంకాయమ్మపేటలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కడియం: గ్రామాల్లో వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించవద్దని ప్రజలకు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ విజ్ఞప్తి చేశారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు ధ్వంసం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ తులసీధర్, ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ శనివారం వెంకాయమ్మపేట గ్రామస్తులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసారు. తులసీధర్ మాట్లాడుతూ ఎవరు ఏ పార్టీలో ఉన్నా గ్రామ ప్రజలందరూ సోదర భావంతో మెరగాలని, ఒక పార్టీకి చెందిన వ్యక్తులు కట్టిన ఫ్లెక్సీలను మరో పార్టీకి చెందిన వారు ధ్వంసం చేయడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ నిఘా ఉంచామని, ఇటువంటి ఘటనలకు ఎవరైనా పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.